# చావు బ్రతుకులు

★

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

"నువ్వు చచ్చిపోతావు"

గుండె దడదడ కొట్టుకుంది. చెవులు నిక్కబొడుచుకున్నాయి. వళ్లంతా ముచ్చెమటలు పోశాయి. ముందుకు వంగి వణుకుతున్న గొంతుతో అడిగాను. "నిజంగా నా స్వామీ?"

స్వామి వారు నా వంక తీక్షణంగా చూశారు. ఆ చూపుకి తట్టుకోలేక తలవంచుకున్నాను.

"అవును బిడ్డా. నేటికి సరిగ్గా పదిరోజుల తర్వాత. నీ జీవితరేఖ అంతవరకే వుంది. ఆ తర్వాత అంతా అయోమయంగా కనబడుతున్నది. అది ఒక గండం అని కూడా చెప్పలేం. పదిరోజుల తర్వాత నువ్వు జీవించటానికి అవకాశం కనబడటం లేదు. దాని అర్థం. చావు. అంతకు మినహా యింకొకటి కావటానికి వీల్లేదు" అన్నారు కరుణాపూరిత స్వరంతో స్వామి.

గజగజమని వణికిపోతున్నాను. ఎంత సమర్థించుకుందామన్నా వీల్లేకపోయింది. అయితే స్వామీ. ఇక నేను జీవించనా? అంతమయి పోవల్సిందేనా?" అన్నాను పుట్టెడు దుఃఖంతో.

స్వామివారు ప్రేమతో నా భుజంమీద తట్టి అన్నారు. "భయపడకు బిడ్డా. మనమందరం భూమ్మీద శాశ్వతంగా నివాసం ఏర్పరుచుకోలేదు. ఏర్పచుకోవటానికి హక్కు లేదు. ఏనాటికయినా యిక్కడినుంచి వెళ్ళిపోవల్సిన వాళ్ళమే. అలా అని దుఃఖించక మానం. ఎంతయినా మనం మానవులమే కదా."

నేను దీనంగా వారివంక చూశాను.

స్వామివారి పెదవులమీద చిరునవ్వు చిందులాడింది. "నామాటయందు నీ కెంత నమ్మకం వుందో నాకు తెలుసు బిడ్డా. నే నన్నమాట జరగకతప్పదు. అయితే నువ్వు విచారించి చేయగలిగింది కూడా ఏమీ లేదు. నీ గడచిపోయిన జీవితాన్ని నెమరువేసుకో. మానవుడిగా పుట్టినందుకు నీ విధుల్ని నువ్వు ఎంతవరకూ నిర్వర్తించుకున్నావో స్మరించుకో. నీవు చేసిన తప్పు లేమయినా వుంటే పశ్చాత్తాపపడు. దీనివల్ల మలినపూరితమైన జీవితాన్ని శుభ్రపరుచుకోటానికి వీలవుతుంది. అంతకు మించి నువ్వు చేయగలిగింది ఏమీ లేదు" అన్నారు నా వీపు నిమురుతూ.

ఎంత ప్రయత్నించినా నా దుఃఖం ఆగలేదు. హృదయంలోని ఆవేశం, దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికినయి. కన్నులవెంబడి నీరు కట్టలు తెంచుకు ప్రవహించింది. స్వామివారి వొడిలో వాలిపోయి బావురుమన్నాను.

వారి మాటకు తిరుగులేదని తెలుసు. చిన్నతనం నుంచే వారు చెప్పినట్లే ఆచరిస్తూవస్తున్నాను. మనసులోని మాటను బయటకు విప్పిచెప్పే మనిషి స్వామివారు. సరిగ్గా యీ రోజు యిక్కడికి రమ్మనమని ఆదేశించారు ఉత్తరంద్వారా. ఎందుచేతనో తెలీదు, నా భవిష్యత్తు పదిరోజులు ముందుగానే తెలియబరిచారు.

"స్వామీ. నా భార్య...పిల్లలు వీళ్ళంతా ఏమయిపోవాలి? వీళ్ళను విడిచి నేను దూరమయి పోవాలా? ఇందుకు దారి ఏదయినా వున్నదేమో చెప్పండి స్వామీ" అంటూ వెర్రివాడిలాగా ఏడ్చాను.

స్వామి వారు చెక్కుచెదరలేదు. నా వంక సానునయంగా చూస్తూ "లాభంలేదు బిడ్డా. నీ భవిష్యత్తును గురించి ముందుగానే చెప్పవల్సి వచ్చినందుకు ఎంతగానో విచారిస్తున్నాను. పదిరోజుల తర్వాత, సరిగ్గా రాత్రి పన్నెండు గంటల అనంతరం నీకు శాశ్వతంగా చీకటి. ఎటుచూసినా చీకటి! దాని అర్థం...మరణమే" అన్నారు.

ఇక ఏం చూసుకుని ఆశపెట్టుకోను? పూర్తిగా హతాశుణ్నయిపోయాను.

స్వామి వారు నా కెన్నో ఓదార్పు మాటలు చెప్పారు. నా జ్ఞాననేత్రం విప్పారేందుకు ఎంతగానో ప్రయత్నించారు. మానవజీవితాన్ని గురించి విపులంగా విప్పిచెప్పారు. కాని నేనా మాటలు ఒక్కటీ వినలేకపోయాను. విన్నా ఆ మాటల్లోని సారం ఆస్వాదించలేకపోయాను. తీరని వ్యథతో, అంతులేని పరితాపంతో కృంగిపోతూ పడివున్నాను.

*　　　　*　　　　*

ఆ రోజు సాయంత్రమే యింటికి చేరుకున్నాను. శ్రీదేవిని చూసి, పిల్లల్ని చూసే నా గుండె పగిలిపోతుందేమో ననుకున్నాను. హృదయం భోరున ఏడ్చింది.

గుమ్మంలోనే ఎదురయింది శ్రీదేవి చిరునవ్వు ముఖంతో. "మీకోసం గంటసేపట్నుంచీ ఎదురు చూస్తున్నాను. అయిదున్నరకేగా రైలు రావలిసింది." అన్నది మృదుమధుర స్వరంతో.

అతి కష్టంమీద దుఃఖం ఆపుకున్నాను. మరి అంతకష్టంతో దిటవు తెచ్చున్నాను.

"ట్రెయిను లేటయింది" అని చెప్పి లోపలకు నడిచాను.

నా ఉబ్బరించిపోయిన ముఖమూ, ఎర్రబడిపోయినకళ్ళూ, రేగిపోయిన జుట్టూ ఆవిడను ఆశ్చర్యపరిచి వుంటాయి. "అలా వున్నారేం!" అ నడిగింది వంటిమీద చెయ్యివేసి.

"తల నొప్పిగావుంది" అబద్ధం చెప్పి తప్పించుకున్నాను. ఊరికివెళ్ళిన పనేమయిందని ఆమె అడగలేదు. నేను అసలు విషయం కప్పిపుచ్చి స్నేహితుణ్ణి కలుసుకోనటాని కని ముందుగానే బొంకబట్టి.

"అమృతాజనం రుద్దేదా?"

"వద్దు" అన్నా యీజీ ఛైరులో కూలబడుతూ.

"కాఫీ తెచ్చేదా?"

"ఊఁ"

శ్రీదేవి కాఫీ తెచ్చేందుకని లోపలకు పోబోయింది. "మాట" అని పిల్చి "పిల్లలేరి?" అని అడిగాను.

"తాతగారింటికి వెళ్ళారు" అని చెప్పి లోపలకు పోయింది. తల పట్టుకు కూచున్నాను. ఎలా యీ దుఃఖాన్ని సహించటం? ఈ ఉద్వేగాన్ని ఆపుకునేది ఎలా? ఇంతకాలం సుఖంగా బ్రతికి, భార్యను చూస్తూ, పిల్లల్ని చూసుకుంటూ ఆనందతరంగాల్లో తేలిపోయిన నా జీవితం, యికముందు అయోమయాంధకారంలో బడి, ఘోర క్షయానికి దారి తీస్తుంటే నే నెలా భరించేది?

నా ముప్ఫయి అయిదేళ్ళ జీవితంలో చావును గురించి ఏ కొద్దిసార్లో ఆలోచించివుంటాను. ఆలోచించినా భయపడివుండను. ఈనాటికి గాని, ఆ ఆవశ్యకత రాలేదు.

చావంటే ఏమిటి? ఏ రూపంలో వస్తుంది? ఏ విధంగా మనిషిని కబళించి వేస్తుంది?

ఎంతో భయంకరంగా తోచింది. ఈ పది రోజులూ యీ దారుణమానసిక వేదనతో కుళ్ళిపోవాలా? శాంతి, సుఖం అనే మాటలనే మరిచిపోవాలా? భార్యని, బిడ్డల్ని చూస్తూ నా వేదనని బయటపెట్టుకోలేక మనసులో వుంచుకుని బాధపడుతూ, వ్యథతో కుమిలి, కృశించిపోవాలా!

శ్రీదేవి కాఫీ తెచ్చింది. నా చేతి కందిస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని అడిగింది.

"ఏమీ లేదు" అని కాఫీగ్లాసు అందుకున్నాను. నోటిదగ్గర పెట్టుకున్నాను గాని రుచించలేదు. రెండు గుక్కలు మాత్రం తాగి బల్లమీద పెట్టివేశాను.

"అయ్యో. అలా వదిలేశారేమిటి అంతా?" అనడిగింది శ్రీదేవి ఆదుర్దాగా.

"మనసేం బాగుండలేదు శ్రీదూ" అన్నాను. అంతా కన్నా యింకేం అనలేక.

"ఇవ్వాళ మీ రదోవిధంగా వున్నారు." అన్నది నా వంక చూస్తూ.

నేనేం చెప్పేది? తలవంచుకుని ఆలోచిస్తున్నాను.

శ్రీదేవి పాపం అక్కడ చాలాసేపు నిలబడింది. నా ప్రవర్తనని గురించే అనుమానిస్తూ నిల్చున్నది కాబోలు. ఎంతసేపటికి మాట్లాడక పోయేటప్పటికి చేసేది లేక లోపలకు పోయింది.

నేను తలపట్టుకు కూచున్నాను. ఈ రహస్యాన్ని మనసులో దాచుకోలేను. అది నాతరంగాదు. ఎవరితో నన్నా చెప్తేకాని కొంతవరకయినా శాంతి లభించదు అనుకున్నాను ఒకసారి.

నా పిచ్చితనానికి నవ్వువచ్చింది. ఎవరితో చెప్పకుంటాను! శ్రీదేవితో యీ విషయం చెప్పగలనా? ఆమె గుండె బ్రద్దలయిపోదూ?



(01)

చావును గురించి ఆలోచించాను. తుదీమొదలూ కనిపించలేదు. మరణాన్ని అనేక రూపాలుగా వూహించుకున్నాను. చనిపోయిన నా ఆప్తుల్నీ, మిత్రుల్నీ గుర్తుకు తెచ్చుకున్నాను. వాళ్లంతా యిప్పు డెక్కడవున్నారు? చచ్చిపోతుంటే ఎలావుంటుంది? వాళ్ళ ప్రాణం ఎంత గిజగిజ లాడిపోతుంది. చచ్చిపోయిం తర్వాత యిన్నాళ్ళనుంచీ ప్రేమగా చూసిన ఆ వ్యక్తి తాలూకు శరీరాన్ని, యిన్నాళ్ళు ప్రాణప్రదంగా చూసుకున్న శరీరాన్ని వూరిబయట స్మశాన వాటికలో...చితి పేర్చి...కాల్చి...

భయంతో వణికిపోయాను. గుండె తటతటమని వేగంగా కొట్టుకోసాగింది. అయినా ఆలోచించక వూరుకోలేక పోయాను.

కాల్చి...తర్వాత చివ్వరికి మిగిలేదేమిటి? ఎముకలు, బొమికలు, పుర్రె. ఈ రక్తమాంసాలతో కూడిన శరీరం సమిసిపోయి అస్థిపంజరం మిగులుతుంది... మృత్యుదేవత వికటాట్టహాసంతో, వివిధస్వరూపాల్తో కళ్ళముందు నాట్యం చేసింది. కళ్ళుమూసుకున్నాను బిగుసుకుపోతూ.

"నాన్నా"

ఒక్క ప్రయత్నాన కళ్ళు తెరవలేక పోయాను.

"నాన్నా!"

కళ్ళు విప్పిచూశాను. చిన్నారి మధు పిలుస్తున్నాడు నన్ను బల్లమీద కూచుని. నా హృదయంలో ఏమూలనో ఆనందం తళుక్కుమని తొంగి చూసింది. వాడిని దగ్గరకుతీసుకుని "ఎక్కడకు పోయావు బాబూ" అ నడిగాను జుట్టు నిమురుతూ.

"ఆడుకుందికి పోయా నాన్నా!"

"అలాగా బాబూ. మరి అక్కయ్యేదీ?"

"అమ్మదగ్గిరకి పోయింది. మరి నాకు బిళ్లలు తెచ్చావు నాన్నా?" అన్నాడు మధు నావంక ఆశగా చూస్తూ.

మనస్సు చివుక్కుమంది. "అరెరె. మరిచి పోయాను బాబూ. రేపొద్దున తెస్తాను. సరేనా?" అన్నాను సముదాయించబోతూ. వాడప్పుడే ఏడుపు ముఖం పెట్టాడు. బ్రతిమిలాడాను కొంచం సేపు. గారాబం చేశాడు. బుజ్జగించాను చాలా సేపటికి వూరుకున్నాడు.

"నాన్నా" అంటూ వచ్చింది సుధ.

"ఏం తల్లీ?"

"అమ్మ భోజనానికి రమ్మంటుంది" అన్నది. సుధ, మధు కన్న రెండేళ్ళు పెద్ద.

"నా కాకలి లేదమ్మా. మీరుపోయి తినండి" అని మధునుకూడా పంపించివేశాను. తర్వాత శ్రీదేవి వచ్చి బలవంతం చేసేంది. "మీ రివ్వాళ ఏదోయిదిగా వున్నారు. భోజనం చెయ్యకపోతే ఎలాగ? ఇంకొంచం ఎక్కువవుతుంది నీరసం. అంటూ బ్రతిమిలాడింది. ఆవిడను ఒప్పించేసరికి నాతల ప్రాణం తోకకు వచ్చింది. వెళ్ళిపోయింది శ్రీదేవి.

మిగిలింది నా దుఃఖం, ఆవేదన. ఎవరు గుర్తిస్తారు నా బాధ?

ఆ రాత్రల్లా ఏడ్చాను ఎవరూ చూడకుండా. ఏం చెయ్యాలి, యీ కుటుంబగతి యికముందేమయి పోతుంది? అన్నది నన్ను మితంగా బాధించింది. ఆలోచనతో కుమిలి కుమిలి ఏ అర్ధరాత్రప్పుడో కళ్ళు మూశాను.

*   *   *

మరునాటి నుంచీ కాలం నిస్సారంగా గడవ సాగింది. ఏపని చేద్దామన్నా మనసుకు స్తిమితం లేక పోయేది. ఎంతసేపూ యింట్లో భార్యనీ, పిల్లల్నీ చూస్తూవుండి పోవాలనిపించేది. నేను బతికేది యింకా కొద్దిరోజులు. నా ప్రాణప్రదంగా చూసుకున్న భార్య, ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న పిల్లలూ వీళ్లనువదిలి ఆ పాడు ఆఫీసులో నిమిషాలు లెక్కబెట్టుకుంటూ ఎంతసేపని వుండేది?

"ఏమిటోయి వున్నట్టుండి అలా మారిపోయావు. మరీ అంత డీలా పడిపోయా వేం?" అనడిగారు ఒక రిద్దరు స్నేహితులు. వాళ్లకేదో సమాధానం చెప్పి తప్పించుకున్నాను.

నాలోని భయాన్నీ, విచారాన్నీ ఒకమూలకు నెట్టి నా కుటుంబగతి చూసుకోటానికి నిశ్చయించుకున్నాను. రెండోరోజు సాయంత్రం తీవ్రంగా ఆలోచించాను. అయితే నేను భయపడినంతగా జరగబోతున్నట్లు కనిపించలేను. నా జీవితాన్ని అయిదు వేల రూపాయలకు యీన్స్యూర్ చేసుకున్నాను రెండేళ్ల క్రితం. ఇప్పటికి కట్టింది రెండువేలే. నేను చచ్చిపోయిం తర్వాత ఆ అయిదు వేలూ భార్యాపిల్లలకు చెందుతాయి. నేనిప్పుడున్న యిల్లుకూడా స్వంతమే. ఈ రెండిటితో వాళ్ళ జీవితాన్ని ఎలాగో ఒకలాగు వెళ్లబోసుకోవచ్చు. అయినా శ్రీదేవి అంత

శక్తిహీనురాలూ కాదు. ఎటువంటి కష్టాలనైనా ధైర్యంతో ఎదుర్కొనే మనస్తత్వం ఆమెది. ఆమెకు తలిదండ్రుల అండ ఎలానో వున్నది. నేను పోయింతర్వాత వాళ్ళు ఆదుకుని వీళ్లకు ఒకమార్గం ఏర్పరచక పోతారా అని సంతుష్టి చెందాను.

ఆ సమస్య యీ విధంగా పరిష్కారం చేసుకున్నాను. ఈ కొద్దిరోజులూ వాళ్ళను విడిచి ఒక క్షణమయినా వుండదల్చుకోలేదు. ఆఫీసు పని తప్పదు కాబట్టి ఆ వేళలు మినహాయించి మిగతా కాలమంతా యింట్లోనే గడపదలుచుకున్నాను. నేను చచ్చిపోయే లోపున ఏది అడిగినా కాదనక నెరవేర్చటానికి కూడా నిశ్చయించుకున్నాను.

ఆఫీసునుంచి వచ్చీ రావటంతోనే పిల్లల్ని దగ్గరకు తీసుకునేవాడ్ని. వాళ్ళిద్దరూ అంతకుముందే నాతో ఏదో చెప్పేందుకు నిశ్చయించుకుని వుండేవారు.

"నాన్నా. మరే. అక్కయ్య నా బలపం దాచేసింది. ఊ" అంటూ నావళ్లోకి ఎక్కికూచుని నేరం చెప్పేవాడు మధు.

నేను ప్రశ్నార్థంగా సుధముఖంలోకి చూసే లోపలే అది అదికాదు నాన్నా. "మరీ...ముందు వాడు నా పుస్తకం చింపేశాడు" అని ఫిర్యాదు చేసేది.

ఇద్దరినీ కోప్పడతానని ఎదురుచూసేవాళ్లు. నాలో దుఃఖం, ఆవేదన విజృంభించటంతో కోపం పూర్తిగా చచ్చిపోయింది. ఇద్దరిని దగ్గరకు తీసుకునేవాడ్ని. బజారునుంచి కొనుక్కువచ్చిన మిఠాయి పొట్లాలు వాళ్లచేతుల్లో వుంచేవాడ్ని. "తప్పమ్మా. అక్కా తమ్ముళ్ళు యీ విధంగా దెబ్బలాడుకుంటారా ఎక్కడయినా. ఇద్దరూ ఒకరంటే ఒకరు ఎంతో ప్రేమగా వుండాలి. ఒకళ్లనుచూసి ఒకళ్లు సంతోషించాలి" అని చిన్నగా బోధించేవాడ్ని. ఇంతలో శ్రీదేవి వచ్చేది. "బాగుంది. యింట్లో ఏదో చేస్తూనే వున్నానాయే మళ్ళీ యీ చిరుతిండికూడా ఎందుకూ? డబ్బు దండగ కాకపోతే?" అనేది. "పోన్లేవే శ్రీదూ. ఈ కాస్తలో ఏమయిపోయింది. ఏమయినా యీ కొద్దిరోజులూ..." అని యింకేదో అనబోయి వెంటనే తప్పు సరిచేసుకునేవాడ్ని.

ఇంకొకరోజు యింటికి రాగానే "అమ్మ కొట్టిందినాన్నా" అని వీపు చూపించాడు మధు. వాడి బిక్కమొహం చూసేసరికి కడుపు తరుక్కుపోయింది. శ్రీదేవిని పిలిచి అడిగాను కారణం. "నేను చచ్చిపోతుంటే వీడితోనూ. యింట్లో లేనివారు మీకేం తెలుస్తుంది. ఆ వంకెకు తగిలించిన లాంతరు విషయం వీడి కెందుకు చెప్పండి. అది కాస్తా తీసి క్రిందపడేసి చిమ్నీ కాస్తా పగలకొట్టాడు." అంది.

పోన్లే ఊరుకోండూ యింకెప్పుడూ చేయవద్దని మందలిస్తే సరిపోయే." అని వాడిని ఎత్తుకుని వీపు నిమిరాను. మధును పెద్దయింతర్వాత డాక్టర్ని చేద్దామని నా వూహ.

నాకో బెంగపట్టుకుంది. పిల్లరిద్దరూ యిలా దెబ్బలాడుకుంటున్నారు. నేను చచ్చిపోతే ఎలా వుంటారో అనుకున్నాను. వీళ్ళ దెబ్బలాటలు వట్టి ఆకతాయి తనానికే అని తెలుసు. అయినా భ్రాంతి అలా అనిపించింది.

ఉన్న కొద్దీ నా మనసులోని ఆవేదన పెరిగిపోతూంది. చీకూ, చింతా ఎరుగనివాళ్లని చూస్తుంటే నా కడుపు మరింతగా తరుక్కుపోతూంది. ఇంకా కొద్దిరోజుల్లోనే వీళ్ళు తండ్రిలేని పిల్లలవుతారు. నల్గురూ వీళ్ళనుచూసి "పాపం తండ్రిలేని పిల్లలు" అంటూ జాలితలుస్తారు గావును. అప్పుడు వీళ్ల చిన్న హృదయం ఎంత బాధపడుతుంది!" అనుకుని కుమిలిపోయాను.

ఆ రోజు ఆదివారం. ఆఫీసు లేకపోవటంచేత యింట్లోనే కూచున్నాను. శ్రీదేవి లోపల వంట చేస్తున్నది. సుధ కూడా అమ్మదగ్గిర ఏవో కబుర్లు చెపుతూ కూర్చుంది. మధు నాదగ్గిర కూచున్నాడు. వాడి ఆటపాటలు చూస్తుంటే నా కళ్లలో నీళ్ళు చిమ్మాయి.

"మధూ" అన్నాను.

"ఏమిటి నాన్నా?" అని వాడు నావంక తిరిగాడు.

"నువ్వు పెద్దయితే ఏం చదువుకుంటావు?"

"డాక్టర్ అని చెప్పావుగా" అన్నాడు కళ్ళు పెద్దవిచేసి.

"నిజంగా చదువుతావా మరి?"

"ఓ"

నేను నలువయిపులా ఒకసారి కలయచూశాను. ముందుకు వంగి మెల్లిగా అన్నాను. "ఒకమాట చెప్తా వింటావా మధూ?"

"ఊ"

"మరి...మరి" నా గుండె వడిగా కొట్టుకుంది. "మరి ఒకవేళ నేను చచ్చిపోతే నువ్వేం చేస్తావు?" అని అడిగేను వణికే గొంతుకతో.

వాడు ఒకనిమిషం దీర్ఘంగా ఆలోచించి "నువ్వు చచ్చిపోవు. ముసిలివాళ్ళు చచ్చిపోతారు" అన్నాడు.

"ఊహు. ఒకవేళ చచ్చిపోతే?..."

"ఏడుస్తాను"

నా హృదయం చెయ్యిపెట్టి కెలికినట్లయింది. ఎంతో నిర్విచారంగా వాడు చెప్తున్న మాటలు నాలో తుపాను లేవదీశాయి.

"ఇంతేనా మరి. మగవాళ్ళు ఏడవకూడదు" అన్నాను తేరుకుని.

"క్షూ?"

"సహించాలి. సహించి పెద్దచదువు చదివి అమ్మావాళ్లను పోషించాలి ఏం?" అన్నాను.

"సరే"

"మరిచిపోవుగా"

"ఇదంతా చచ్చిపోతేగా?" అని పక పక నవ్వేశాడు వాడు. శ్రీదేవి ఎక్కడ వింటుందోనని భయపడ్డాను. మనసులో యిష్టంలేకపోయినా సంభాషణ మార్చక తప్పిందికాదు. నా పిచ్చిగాని యికముందేం ఘోరం జరగబోతుందో ఆ చిన్న హృదయానికేం తెలుస్తుంది.?

ఆ రోజు భోజనం చేసేటప్పుడు అంది శ్రీదేవి. "మీరు బొత్తిగా అన్నం తినటంలేదు."

జవాబేమని చెప్పను. ఒకమూల దిగులు. మరోమూల భయం నన్నావహించి ఉక్కిరి బిక్కిరి చేసివేస్తుంటే నాకేదిమాత్రం సహిస్తుంది?

చిరునవ్వు నవ్వాను. జీవం లేకుండా.

"నేను చూస్తున్నానుగా. నవ్వటం కాదు. అసలు మీతరహానే మారిపోయినట్లయింది. ఏమిటో ఎప్పుడూ ఆలోచిస్తూనే వుంటారు" అంటూంటే శ్రీదేవిగొంతులో కొంచంగా గీర ధ్వనించింది.

"అదికాదు శ్రీదూ...వంట్లో ఎలాగోవుంటుంది" అన్నాను ఏమీ చెప్పకుండా వూరుకోక.

"డాక్టరుదగ్గరకు వెళ్ళి మందు పుచ్చుకోకూడదూ?"

"ప్రతిస్వల్పవిషయానికీ మందులూ, మాకులూ ఏమిటీ పోనిద్దూ" అని త్రోసివేసి "మజ్జిగ పొయ్యి" అన్నాను.

"అప్పుడేనా? ఏమీ తినందే?"

"దయవుంచి నన్ను చంపబోకు శ్రీదూ, యింకేం అనలేను అన్నాను. ఆమె మాట్లాడకుండా మజ్జిగ తెచ్చిపోసింది. నాలుగు మెతుకులు తిని లేచి వచ్చేశాను.

మనిషికి ఆలోచించటం అనేది తెలియకుండా వుంటే ఎంతో బాగుండేది. కనీసం ఆలోచించటాన్ని అరికట్టే శక్తినయినా ప్రకృతి యివ్వగలిగితే యింతకన్నా ఎన్నో రెట్లు వికాసవంతంగా గడుస్తుంది జీవితం.

ఆలోచించకుండా వుండటానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినయి. మనసు పరిధులు దాటి విహరించింది చావు ... ఎముకలు ... భయంకరంగా కళ్లముందు గోచరించినై. అందరిమానవుల్లాగా నేనేనూ ఒక ఏదోరూపంలో మృత్యుదేవత ఒడిలో యిమిడిపోయి, స్మశాన వాటికలో, మట్టిలో, నా తాలూకు రక్తమాంసాలు మినహా మిగిలిన చలనం లేని అవయవాలు మట్టిలో పొర్లాడుతూ వుండగా... యిక పైకి పోలేక ఒక నిట్టూర్పు విడిచాను.

నేనున్న పరిస్థితిలో మనశ్శాంతి ఎంతో అవసరం అనిపించింది. ఏదయినా సినిమాకు సాయంత్రం పోదామనుకున్నాను. శ్రీదేవిని పిలిచాను.

"పిలిచారా?" అంటూ వచ్చింది ఆవిడ.

"అవును. ఇవేళ సినిమాకి పోదామా మరి?"

"దేనికి?"

"దేనికో ఓదానికి. ఏం?" అన్నాను.

"నాదేముంది? మీ యిష్టం?"

"సరే. పిల్లల్ని సాయంత్రానికల్లా రెడీ చెయ్యి" అంటూ, శ్రీదేవి వెళ్ళిపోయింతర్వాత నిద్రపోవటానికి ప్రయత్నం చేశాను. ఎంతో ప్రయత్నం చేశాక ఒక అరగంటసేపుమాత్రం కలత నిద్ర పట్టింది.

సాయంత్రం సినిమాకి వెళ్ళాను భార్యా పిల్లలతో. మొదట బండిలో పోదామనుకున్నాను. కాని నడిచేపోతే బాగుంటుం దనిపించింది. తల్లిచేయీ మధూ, నా చెయ్యి సుధా పట్టుకుని నడుస్తూ బయలుదేరాము. అలా నడిచిపోతుంటే నా మనస్సెందుకో సంతోషంతో ఉరకలు వేసింది. ఈ ఆనందం

ఎందులో లభిస్తుంది అనుకున్నాను. మధు వేసే చిట్టి ప్రశ్నలకు జవాబులు చెప్తూ నడుస్తుంది శ్రీదేవి. ఎందుకో తెలీదుగాని నన్ను గర్వం ఆవహించింది. ఆదర్శదాంపత్యం అంటే ఏమిటో యీనాటివరకూ నాకు సరిగ్గా అర్థం తెలీదు. మా జీవితం, మాసంసారం అలాంటిదే నేమో ననుకున్నాను. మనస్సును బాధ పెట్టే సమస్య లేమీ లేకుండా వుంటే ప్రపంచంలో యింతకంటే ఆనందకరమైన అనుభవం వేరే ఏముంటుంది? అనిపించింది. రోడ్డుమీద పోయేవాళ్ళలో చాలామంది మావంక ముగ్ధత్వంతో చూడటం కని పెట్టి లోపల ఎంతగా సంతోషించానో చెప్పలేను. మధు ప్రశ్నలకు జవాబు చెపుతూ ముందుకు నడుస్తున్న శ్రీదేవి అమాయకమైన ముఖంలోకి చూశాను. ఆమె అందాన్నిగురించి తలపోయక తప్పిందికాదు.

"శ్రీదేవికేం? బంగారు బొమ్మ!"

జవాబు చెప్పుకున్నాను. తర్వాతపోయి సినిమా చూశాము. సినిమా చూడటంలో నే నెక్కువగా లీనమయిపోకపోయినా, అందులో లీనమయిపోయి క్షణ క్షణానికి ముఖభంగిమలు మారుస్తున్న శ్రీదేవినీ, పిల్లల్నీ చూడటంలో లీనమయిపోయాను.

* * * *

ఈ విషయం గడిచిపోయిన మూడురోజుల తర్వాత నేను యీజీఛైర్‌లో కూర్చుని వుండగా, నా చొక్కా గుండీలు సవిరిస్తూ "రేపు మధు పుట్టిం రోజు" అన్నది శ్రీదేవి, ఉదయం ఎనిమిది గంటల వేళప్పుడు.

స్వామివారు చెప్పినతర్వాత అవాళ్టికి ఎనిమిది రోజులు గడిచాయి. సమయం దగ్గరకొద్దీ నాలోని భయం, ఆవేశం ఎక్కువవుతూనే వున్నాయి. అయితే నాకు ఒక్కటే అనుమానం పట్టుకుంది. నాకింతవరకూ రోగం, రొష్టూ ఏం రాకపోవడమే కారణం. జబ్బా, అదీ ఏంలేకుండా, హఠాత్తుగా చనిపోతానా?

"రేపే నేనా?" అన్నాను ఆనందాశ్చర్యాలతో శ్రీదేవిమాటకు జవాబుగా.

"ఊ"

ఆమె ముఖంవంక చూశాను. ఉత్సాహం కనబడుతూన్నా, నే నేమంటానో ప్రశ్న భయంకూడా అస్పష్టంగా అగుపించింది. దానికి కారణం లేకపోలేదు. నిరుడు శ్రీదేవి నన్ను యిలాగే అడిగినప్పుడు, ఆర్థికసమస్యమూలంగా పుట్టినరోజు ఘనంగా జరుపు టనేందుకు ఒప్పుకోలేకపోయాను.

"అయితే ఏమిటి?" అన్నాను.

"పండగ...చేద్దామనీ...అన్నది నసుగుతా, నసుగుతూ. ఇన్నేళ్లనుంచీ కాపురం చేస్తున్నా ఏదయినా విషయం చెప్పాలంటే ఆమె సంకోచించేవిధమూ ఆ ముఖభంగిమలూ చూస్తూంటే ఏమనుకోవాలో అర్థం, కాలేదు. ఆమె చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకుని "నీ యిష్టానికి వ్యతిరేకం చెప్తానా? అలాగే కానియ్యి శ్రీదూ" అన్నాను. ఆమె చెక్కిళ్లు సిగ్గుతో ఎఱ్ఱబడినై. ముందుకు వంగి దగ్గరకు లాక్కోబోయాను.

"అబ్బా" అంటూ నన్ను వదిలించుకుని పారిపోయింది. క్షణకాలం ముగ్ధుడనయిపోయాను.

ఆ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడు బజారుకుపోయి కావలిసినవన్నీ తీసుకున్నాను. వెచ్చాల షావుకారుతో కావల్సినవి చెప్పి యింటికి పంపించమన్నాను. మధుకు రెండు జతల చొక్కాలాగూలూ తీసుకున్నాను. సుధకికూడా ఖరీదైన బట్టలు తీసుకున్నా మంచివి. శ్రీదేవికి రెండు చీరెలు తీసుకున్నాను. అందులో ఒకటి మైసూరు సిల్కుచీరె. ఎన్నాళ్ళక్రిందటనో అడిగింది శ్రీదేవి అటువంటిది కావాలని. కాని డబ్బు విషయం ఆలోచించే కొనలేకపోయాను.

వీటన్నిటితో బాటు అంతకు క్రితంరోజులే నా స్నేహితులతోగాని, యింకెవరితోగాని నాకున్న లావాదేవీలన్నీ తీర్చేసుకున్నాను. నా అనంతరం నాకుటుంబానికి ఎటువంటి చిక్కులూ వుండకూడదని నా అభిప్రాయం.

ఇంటికి చేరేసరికి శ్రీదేవి నాకోసం ఎదురు చూస్తూ నిల్చుంది గుమ్మంలో. ఆ రోజు ఎందుకో చెప్పరాని ఆకర్షకంగా కనబడింది. ఆనందంతో నిండిన ఆమెకన్నుల్ని చూసి ఏలోకంలోనో విహరించాను. లోపలకి అడుగు పెడుతూండగానే పిల్లలిద్దరూ వచ్చేసి చుట్టు ముట్టారు.

"ఏమిటో చాలా తెచ్చారు! ఏమాత్రం ఖర్చు పెట్టారేమిటి?" అనడిగింది నా చేతిలోంచి అందుకుంటూ.

"ఎంత ఖర్చు పెడితే నేం? తెచ్చానా లేదా?" అన్నాను కూచుంటూ సుధను దగ్గరకు తీసుకుని.

శ్రీదేవి అన్నీ విప్పిచూసి ఆనందాశ్చర్యాలలో మునిగిపోయింది. "ఇదిగో చూడ్రా మధూ. ఇవన్నీ నీకే. రేప్రొద్దున తలంటిపోసుకుని యివి తొడు

క్కుందువుగాని. ఇవ్వి దాచుకోనేం?" అంది ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ. "ఇదిగోనే సుధా. యివ్వి నీవేనే. ఈగౌను తొడుక్కుని చూసుకో" అన్నది సుధకు అందిస్తూ. "అరె. ఇంత ఖర్చుపెట్టి యిప్పుడీ సిల్కుచీరెందుకు తెచ్చారు? యిప్పుడు నేనడిగానా మిమ్మల్ని?" అనడిగింది నావంక చూస్తూ. ఆ చీరెను చూసినతర్వాత ఆమె ముఖంలో వ్యక్తమైన ఆనందంచాటున వున్న కొద్దిపాటి విచారం, పొదుపరితనం నా కళ్ళబడింది.

"నీ కిష్టమేగా."

"అయితేనూ! యిప్పుడేనా దానికి సమయం, ఇన్నిఖర్చులతోబాటు..."

"ఇంక చాలిద్దూ" అన్నాను నేను. "నువ్వెప్పట్నుంచో మనసుపడ్డావాయె దీన్నిగురించి. తీసుకొద్దామంటే ఎప్పటికప్పుడు వీల్లేకపోతున్నాది. ఆమాట లిక మానేసి చక్కా కట్టుకో" అన్నాను సలహారూపంలో.

శ్రీదేవి మారుమాట్లాడలేదు.

మధు, సుధ వాళ్ళబట్టల్ని చూసుకుంటూ వాళ్ల ధోరణిలో వాళ్లున్నారు. హఠాత్తుగా శ్రీదేవి నావంక చూసి అడిగింది. "అరె. యిదేమిటి? మీకేం తెచ్చుకోలేదేం?"

నేను తెల్లబోయి చూశాను. "ఎందు నాకు? నాకిదివరకే చాలా వున్నాయి" అన్నాను.

ఆమె ముఖం చిన్నబోయింది. "ఇదివరకటి సంగతెందుకు యిప్పుడు. మాకుమాత్రం లేవా? పండగ మాకొక్కళ్ళకేనా? మీరు లేకుండా మాకేనా కావల్సింది" అన్నది రుద్ధకంఠంతో.

"అదికాదు శ్రీద్దూ..." అని యింకా ఏమో చెప్పబోయాను.

"మీరు యింకా ఏమీ చెప్పక్కర్లేదు. మా అందరికీ తెచ్చి మీరు వుత్తగావుంటే మాకు సంతోషంగా వుంటుందా ఏమన్నా? మాట్లాడరేం?" అంది యిందాకటి స్వరంతోనే. నాకూడా మన స్సెదో లాగా కెలికి వేసినట్లయింది. ఈ చిన్న విషయంవల్ల ఆమె కింత కష్టం, బాధ కలుగుతాయని అనుకోలేదు. అయినా ఎందుకు నాకు: ఇవ్వాళా, రేపటి భాగ్యానికి...

హృదయం రోజూ ఏడుస్తూనేవుంది. ఇప్పుడూ ఏడ్చింది. శ్రీదేవి సంతోషానికి ఆరాత్రి నాకోజత పంచ, చొక్కా కొనుక్కోక తప్పలేదు.

*     *     *     *

మరునాడు యింట్లో పండుగ ఘనంగా జరిగింది. మధు ముఖంలో ఆనాడు ఎంత ముగ్ధత్వం వెల్లి విరిసిందో చెప్పలేను. వాడిమీద వాత్సల్యం పెల్లుబికింది. వాడు ఆరోజంతా కలకల్లాడాడు. చనిపోతూచనిపోతూ భార్యా బిడ్డల ముఖాల్లో యింతఆనందం చూసినందుకు నా భాగ్యానికి ఎంతగానో అభినందించుకున్నాను. అమ్మలక్కలంతా వాడిని ఆశీర్వదించారు. హృదయపూర్వకంగా, కన్నీళ్ళతో నేనూ ఆశీర్వదించాను. డాక్టరువికమ్మని.

ఆరాత్రి స్నేహితులకి డిన్నర్ ఏర్పాటు చేశాను. చాలా సంతోషంగా గడిచింది. నవ్వాశీర్వదించారు కొందరు మిత్రులు, త్వరలో యింకోపాపను ఎత్తుకొమ్మనమని. ఏడుపులో నవ్వు వచ్చింది.

అంతా అయిపోయేటప్పటికి పదకొండయింది. స్నేహితులంతా వెళ్ళిపోయారు. పిల్లలు పడుకుని నిద్రపోసాగారు. శ్రీదేవికూడా పడుకుంది. నాకెంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. ఎంత ఆపుకుందామన్నా ఉద్వేగం ఆగలేదు.

ఇంకా ఒక్కరోజు బ్రతికేది. నేను జీవితంలో ఏం అనుభవించినా, ఏంచూసినా యీ కొద్దికాలంలోనే. ఆ తర్వాత—యింకో యిరవై నాల్గు గంటల తర్వాత...?

తిరిగిబుర్ర వేడెక్కిపోయింది. లేచిఅటూ, ఇటూ తిరిగాను కాసేపు. నిద్రపోతున్న పిల్లలవంక తనివితీరా చూశాను. వంగి యిద్దర్నీ మనసారా ముద్దు పెట్టుకున్నాను. నా కన్నీరు చెంపలమీంచి జారి వాళ్ళమీద పడినప్పుడు వాళ్ళకెక్కడ మెలకువ వస్తుందోనని భయపడ్డానమితంగా.

శ్రీదేవివంక చూశాను. నిర్మలంగా నిద్రపోతూంది. ఆమె కంఠంలో దాక్కుని తొంగి చూస్తున్న మాంగళ్యం బెడ్ లైటు వెలుగులో కంటబడగానే నాకు దుఃఖం ఆగలేదు.

"ఏడుస్తున్నారా?" అని శ్రీదేవి అడిగేటప్పటికి ఉలుక్కిపడ్డాను. నా కన్నీరు జారి ఆమెకు నిద్రాభంగం చేసినట్లు అప్పటికిగాని తెలియలేదు.

నాకేం జవాబు చెప్పాలో తెలీక తడబడపడి "అబ్బే...ఏం...ఏంలేదు" అన్నాను ఆమె ప్రక్కన కూచుంటూ.

శ్రీదేవి నా ముఖంవంక పరిశీలనగా చూస్తూ "అబద్ధం చెప్పకండి. మీ రెండుకో అదోవిధంగా వుంటున్నారు. మీ పరిస్థితిచూసి అర్థంగాక నాలో నేనే కుమిలిపోతున్నాను. చెప్పరా?" అంటూ నా ముఖం తనవంక తిప్పుకుని దీనంగా చూసింది.

కరిగిపోయాను మంచులాగా. ఆ క్షణంలో నాలో దాగున్న సర్వస్వం, యిన్నిరోజులు అట్టి పెట్టుకున్న నా దుఃఖం పూసగ్రుచ్చినట్లు చెప్పేయాలన్నంత ఆవేశం కలిగింది. అతికష్టంమీద నన్ను నేను నిగ్రహించుకున్నాను.

"ఏంలేదు శ్రీదూ. ఎందుకో మనశ్శాంతి లేకుండా వుంది" అన్నాను అబద్ధం చెపుతూ.

"ఎందుకూ శాంతి లేకపోవటం? మీమనస్సులో ఏదో బాధ భరిస్తున్నారు. ఇటు చూడండి. నిజంగా?" అంటూ అడిగింది నా కళ్ళవంక సూటిగా చూస్తూ.

"నీతో అబద్ధం చెబుతానా శ్రీదూ?" అన్నాను బాధపడుతూనే.

నమ్మింది పాపం. "ఎందు కనవసరంగా అలా బాధపడతారు? హాయిగా పడుకోండి" అన్నది నా చెంపలు నిమురుతూ.

"శ్రీదూ!"

"ఊఁ"

"నేనంటే...నీకు...ప్రేమేనా?"

"అయ్యో. ఇదేమిటండి? ఇన్నాళ్ళనుంచి మీతో సమంగా వుంటున్న నన్ను యింకా అర్థం చేసుకోలేకపోయారా? మీకంటే, పిల్లలకంటే నాక్కావాల్సింది ఏముందింక?" అన్నది గద్గదిక కంఠంతో.

"అయ్యో శ్రీదూ" అనుకున్నాను మనసులో.

"శ్రీదూ. అబ్బ" అంటూ ఆమెను నా హృదయానికిదగ్గరగా, మరెప్పుడూ విడిచిపెట్ట వద్దన్నంత దగ్గరగా, రెండు హృదయాలు ఏకమై పోవాలన్నంత దగ్గరగా ఆమెను హత్తుకున్నాను.

*    *    *    *

మరునాడు వచ్చింది.

ఆరోజు ఒక్కొక్క నిమిషం నాపాలిటి యమదూతలాగే కనిపించింది. ఆఫీసుకు పోయేందుకుకూడా భయం వేసింది. దార్లో ఏమవుతుందో ఏమో. సెలవు రాసి పంపించాను.

ఆరోజు నేను చేసిన ప్రతిపనీ పిచ్చిపనిలాగా కనిపించిందంటే ఆశ్చర్యం కాదు. భార్యా పిల్లలు కంటికి కనిపిస్తుంటే నేను మనిషిలాగా వుండలేకపోతున్నాను. అందుచేత నా గదిలోకివచ్చి కూచుని పుస్తకాలన్నీ పిచ్చిగా తిరగవేయసాగాను.

"ఇవాళ ఆఫీసుకుపోలేదేదమని" అడిగితే "ఇంట్లో వుండిరాయవలసింది బోలెడంత వుం"దని జవాబు చెప్పాను శ్రీదేవికి. అంచేత గదిదగ్గరకు ఎవ్వరూ రాలేదు.

సెకన్లు, నిమిషాలు, గంటలు గడిచిపోతున్నాయి. ... నా ప్రాణం తల్లడిల్లిపోతూంది.

రాత్రి భోజనందగ్గిర బంగాళదుంపల కూర వేసి "మీకిష్టమని చేశాను" అన్నది శ్రీదేవి. చివుక్కుమన్నాను. ఔను. ఇకముందు తినలేనుగా. కడుపారా తృప్తిగా తిందామనుకున్నాను. కాని ఎంత ప్రయత్నించినా ముద్ద మింగుడు పడలేదు. పీకమీద కత్తి పెట్టి తినమంటే ఎంత యిష్టమైనదిమాత్రం ఏం తినగలుగుతాం?

రాత్రి పదయింది. శ్రీదేవి పక్కలు వాల్చింది. కళ్లారా ఒకసారి అందర్నీ చూసుకుని "నేనాఫీసుకు సంబంధించినది రాసుకోవాలి శ్రీదూ. అప్పుడే పడుకోను. మీరు నిద్రపోండి" అన్నాను శ్రీదేవితో.

"నిద్ర పాడుచేసుకొని రాత్రిపూట ఎందుకు? రేపొద్దున చూసుకోకూడదా?" అంది.

"కాదులే. అర్జంటయినపని" అనిచెప్పి గదిలోకి వెళ్ళిపోయాను. చాలాసేపటివరకూ శ్రీదేవి కదుల్తూనే వుంది. నిద్ర పోయిందని నిశ్చయం చేసుకున్న తర్వాత గది తలుపులు గడియ వేసుకుని గోడనున్న గడియారం వంక చూశాను.

పదకొండయింది.

ప్రాణాలు ఉగ్గబెట్టుకుని అటూ యిటూ తిరుగుతున్నాను. ఏరోగం రొష్టులేకుండా నాకు చావు ఏవిధంగా వస్తుందో అని ఎదురుచూడసాగాను.

దుఃఖాన్ని నానుండి దూరం చేసుకున్నాను. కాలం ఎలానూ సమీపించింది. దుఃఖపడుతూ కూర్చుంటే ప్రయోజనం ఏముంది? స్థిరచిత్తంతో కొంతసేపు పరమేశ్వరుణ్ని ప్రార్థించాను. తర్వాత సాధ్యపడలేదు. కాగితం, కలంతీసి శ్రీ దేవి పేరిటి ఒక

ఉత్తరం రాశాను. ఇలా చనిపోతున్నట్టూ, వాళ్ళ అభివృద్ధికోసం నేను చేసిన ఏర్పాట్లూ, మధును డాక్టరు చదివించమనీ పిల్లల్ని ప్రాణప్రదంగా చూసుకొమ్మనీ రాసి డ్రాయరులో పెట్టాను.

తిరిగి ఆలోచన్లు కాల్చుకు తిన్నాయి.

ఎలా వస్తుంది చావు? ఏ కాలకూట విషసర్పమో యీగదిలో పొంచివుందా? లేక హఠాత్తుగా గుండె ఆగి చనిపోతానా?

స్వామివారు చెప్పినమాటలు నా వీనుల్లో ప్రతిధ్వనించాయి. "పదిరోజులతర్వాత రాత్రి పన్నెండు గంటల అనంతరం నీకు శాశ్వతంగా చీకటి. ఎటు చూసినా చీకటి."

అదురుతున్న కళ్ళతో గడియారంవంక చూశాను. పావు తక్కువ పన్నెండు.

హృదయం బద్దలయేటట్లు కొట్టుకొంటున్న నాగుండె వడిని ఆపుదామని రొమ్ముమీద గట్టిగా చెయ్యివేసి నొక్కుకున్నాను. ... ఒళ్లంతా వెచ్చగా వుంది. భయంచేతనా? సరిగ్గా ఊపిరిపీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లుగావుంది. కిటికీ తలుపులు కూడా మూసివున్న కారణంచేతనా?

కళ్ళముందు ఏడుస్తూ ఆలుబిడ్డలు గోచరిస్తున్నారు. గుండెలు బ్రద్దలయేటట్లు ఏడుస్తున్నారు. భయంతో గట్టిగా కళ్ళుమూసుకున్నాను.

ఉన్నట్లుండి గదంతా వెచ్చగా మారిపోతున్నట్లు అనిపించింది. ఏదో ఉక్కిరిబిక్కిరిచేసే వాసన నన్ను అశక్తుడ్ని చేసివేస్తూంది. దూరంగా ఎక్కడో ఏడుపులూ,అరుపులూ చెవుల్లో చిన్నగారొదపెడుతూ కృంగదీస్తున్నాయి.

ఇవన్నీ మరణానికి ముందు లక్షణాలా?

అతి ప్రయత్నంమీద కళ్లు తెరిచాను. గడియారం వికటాట్టహాసం చేస్తూ ప్రత్యక్షమయింది. ఒక్కసారిగా ఆనందంతో అరవబోయి తట్టుకున్నాను. పన్నెండు దాటింది. బ్రతికానా? స్వామివారిమాట అబద్ధమయిందా?

సంతోషంతో ఎగిరి గంతు వేద్దామనుకున్నాను. కాని యిదేమిటి? గదంతా తెల్లగా ఏదో వ్యాపిస్తుందేమిటి? ఏమి టలా వేడిగా? బ్రతికివుండి యిలా ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నానేమిటి?

ఎక్కడనుంచో భయంకరంగా అరుపులు వినిపించాయి. ఏం జరుగుతుందో తెలుసుకోటానికికూడా అశక్తుడ్నయాను. ఒక్క ఉదుటున వెళ్ళి తలుపులు తీశాను. వెంటనే కెవ్వుమని కేకతో క్రింద పడిపోయాను.

మంటలు. ఇల్లంతా మంటలు. ఉవ్వెత్తున వికటాట్టహాసంతో ప్రజ్వరిల్లుతున్నాయి. ఏనుగుబలంతో లేచి నిల్చున్నాను. నా భార్య, బిడ్డలు, వాళ్లేమయిపోయారు! నావళ్ళు నాకు తెలిసేస్థితిలో లేను. ఒక్క విసురున మంటల్లోకి దూకాను.

నా శక్తికొద్దీ మంటల్ని అటకాయించాను. పిచ్చిగా కేకలువేస్తూ పిల్లల్ని పిలిచాను. మంటలు నన్ను నిలవనివ్వలేదు. బయటకి తరిమికొట్టాయి? ఏమయిపోయారు నాపిల్లలు? ఎలా నిల్చునేది అక్కడ?

నేనెలా బయటకు చేరుకున్నానో తెలీదు. నన్నెవరో గట్టిగా పట్టుకున్నారు. ఆ తర్వాత ఏమయిందీ తెలీదు.

కళ్ళు తెరిచి లోకంలో పడేటప్పటికి కాలిపోయి వికృతరూపంలోవున్న మూడు స్వరూపాలు పడివున్నాయి. వాడిమీదపడి హృదయం బ్రద్దలయేటట్లు ఏడిచాను. ఏంచేస్తే నా దుఃఖం తీరుతుంది? ఏంచేస్తే వాటికి తిరిగిజీవం వస్తుంది? ఏడ్చిఏడ్చి నాగుండె పగిలిపోతే బాగుండు ననిపించింది. అయ్యో. ఇక నేనేం చూసుకుని బ్రతకాలి?

తలఎత్తి చూశాను. నాయింటి గోడలు మాత్రం ఏడుస్తూ కనిపించాయి. నలుగురూ నన్నోదార్చారు. వాళ్ళ మాటలు నేను వినలేదు. స్వామివారు చెప్పిన మాటే నాకు పదేపదే వినిపించింది. "ఆమీదట శాశ్వత్వంగా చీకటి. దాని అర్థం...?"

*    *    *    *

బ్రతుకుతున్నాను — చచ్చిపోయి.